చాటలో గోధుమలు పోసుకుని బాగుచేస్తూ వసారాలో కూర్చుంది వర్ధని.

ఆవిడ వయసు నలభై సంవత్సరాల కంటె ఎక్కువ వుండదు. కాని కష్టాలతో కాగి కాగి యాభైఏళ్లు పైబడిన దానిలా ఉంది.

మనిషి బాగా ఎండిపోయి నరాల పోగులా ఉంది. ఆవిడలో ఊపిరి వుందో లేదో చెప్పటం కష్టం. సైన్సుల్యాబ్ వాళ్లు కూర్చోపెట్టిన అస్థిపంజరంలా అనిపిస్తుంది. కేవలం అనిపించటమే కాదు. ఇంకా కొద్దిరోజుల్లో వర్ధనికి ఈ భూమ్మీద నూకలు చెల్లిపోతున్నాయి.

వర్ధనికి గుండెజబ్బు. ఊపిరితిత్తులకి రంధ్రాలు ఏర్పడి క్రమంగా అవి పెద్దవి అవుతున్నాయి.

ఆపరేషన్ చెయ్యాలి.

అంత ఆర్థికస్తోమతు వర్ధనికి ఎక్కడిది? పూట గడవటమే కష్టంగా వుంది. చాలామంది పుట్టపర్తి వెళ్లమని సలహా ఇచ్చారు.

కాని

అదిమాత్రం అంతతేలికా?

రానుపోను ఖర్చులు, అక్కడ కనీసం ఓ రెండు నెలలు అయినా వుండాలి. ఆ ఖర్చు...

దీనికంతటికి డబ్బు ఎక్కడ్నుంచి తేవాలి?

భర్త కాలం చేసాక వర్ధని అడ్రస్ కేరాఫ్ దారిద్ర్యం అయ్యింది!

"కావ్ కావ్"

ఎదురుగా వున్న వేపచెట్టుమీద కాకి అరుస్తుంది.

వర్ధని తలెత్తింది.

మధ్యాహ్నం పన్నెండు అవుతూంది.

ఎండ బాగానే ఉంది.

"ఉదయం అనగా వెళ్లిన చంద్ర ఇంకా రాలేదేంటి?" అనుకుంది.

అరచేత్తో గోధుమలు నలిపి పొట్టు చెరగసాగింది. వర్ధని కూతురు చంద్రకళ ఇంటర్ పాసయ్యింది. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు రాయబోతోంది. ఉద్యోగాలకి ప్రయత్నం చేస్తోంది.


"తను పోయేలోగా దానికేదన్న ఉద్యోగం దొరికితే దానికి ఓ ఆధారం ఏర్పడుతుంది. తనకి నిశ్చింత" అని వర్ధని తాపత్రయం.

ఆడపిల్ల. వయసులో వుంది. తల్లితండ్రి అండ లేక, ఉద్యోగం లేక ఒంటరిగా ఎలా బతుకుతుంది అని వర్ధనికి పెద్ద దిగులు.

కాని ఏం చెయ్యగలదు?

భగవంతుడికి దయ లేదు.

పైవాడు తనని పిలుస్తున్నాడు. రమ్మని తొందర చేస్తున్నాడు.



\- కాకాని కమల

వెళ్లక తప్పదు.

తను అసలు ఇంకా బ్రతికిఉండటమే ఆశ్చర్యం అంటున్నారు డాక్టర్లు. ఎందుకంటే మరి వాళ్లు పెట్టిన గడువు దాటిపోయింది.

ఏ క్షణంలో నయినా మృత్యువు తనని కబళించవచ్చు. పైగా తనకి ఈ మధ్య బొత్తిగా తిండి సయించటం లేదు. గుప్పెడు తిన్నా అరగదు. నిద్ర కరువైపోయింది. పెద్ద శబ్దం విన్నా, ఏదన్నా హఠాత్తుగా శుభం గాని, అశుభం గాని విన్నా తన గుండె తట్టుకోలేక పోతూంది. ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అయిపోతూంది. మృత్యువు కనిపిస్తుంది.

దిక్కులేని వాళ్లకి దేముడే దిక్కు.

చంద్రకళని ఆ భగవంతుడే ఆదుకోవాలి.

వర్ధని ఆ కాస్త ఆలోచనకే అలసిపోతూంది.

చాట పక్కనపెట్టి వర్ధని గోడకి ఆనుకుని కళ్లు మూసుకుంది.

ముఖం అంత చమట కమ్మింది.

"ఉష్..." అనుకుంది భారంగా.

అంతలో గేటు చప్పుడయ్యింది.

చంద్రకళ లేడిలా పరిగెడుతూ ఉత్సాహంగా లోనికి వచ్చింది.

"అమ్మా! నీకో గుడ్‌న్యూస్" అంటూ గేటు దగ్గర్నుంచే వెర్రికేక పెట్టింది.

"ఏంటి చంద్రా. నీకు ఉద్యోగం వచ్చిందా తల్లీ?"

"వస్తేరా వచ్చు"

చంద్రకళ గుండ్రంగా కళ్లు తిప్పింది. పెదవులు అందంగా విరిచి ముసిముసిన వ్వులు నవ్వింది తల్లి ముఖంలోకి చూస్తూ.

వర్ధని నొసలు ముడుచుకుంది.

"వస్తే...రావచ్చా? అదేంటి?"

చంద్రకళ నేలమీద తల్లిపక్కనే చతికిల్లపడింది. తల్లిని సుతారంగా రెండుచేతులా వాటేసుకుంది. "అమ్మా! ఇవ్వాళ తమాషా జరిగిందే. ఇంటర్వ్యూ చేసినాయన నా సర్టిఫికెట్లు చూసి గార్డియన్ అన్నచోట మీ అమ్మ పేరు రాశారేమిటి?" అన్నాడు.

"మా నాన్న చనిపోయారని చెప్పాను."

"ఆయన పేరేమిటి? అన్నాడు, చెప్పాను. ఆయనకి నాన్న బాగా తెలుసుటమ్మా. మనింటికి వస్తానన్నాడు. నువ్వు

కూడా బాగా తెలుసన్నాడమ్మా"

వర్ధని కూతురుకేసి అదోలా చూసింది.

"ఆయన పేరేమిటి? అదే...నిన్ను ఇంటర్వ్యూ చేసిన ఆయన పేరు."

"చక్రపాణి. ఆ కంపెనీ ఎమ్.డి. అట. నలభైఏళ్ల కంటె ఎక్కువ వుండవు. ఆయనకి ఇంకా వేరే కంపెనీల్లో కూడా ఏవో పదవులు ఉన్నాయట. నీగురించి చాలా విషయాలు గుచ్చి గుచ్చి అడిగాడమ్మా. నీకు గుండెజబ్బు అని తెలిసి చాలా బాధ పడ్డాడు. నాన్న పోయాక మన కుటుంబం చితికిపోయిందని, కష్టంగా రోజులు గడుస్తున్నాయని, నాకు ఉద్యోగం వస్తే కాస్త ఆధారం అవుతుందని చెప్పాను."

"ఏమన్నారు?"

"విని ఊరుకున్నాడు. ఏం చెప్పలేదు. ఈ వారం చివరిదాకా ఇంటర్వ్యూలు ఉన్నాయటమ్మా. ఫ్యూన్ చెప్పాడులే. వచ్చేవారంలో నే వెళ్లి ఒకసారి ఆయన్ని ఇంటిదగ్గర కలుసుకుందాం అనుకుంటున్నాను. నాకంటె ఎక్కువ క్వాలిఫికేషన్ ఉన్నవాళ్ళు ఇంటర్వ్యూకి వచ్చారమ్మా. కాని ఆయన తల్చుకుంటే నాకు ఉద్యోగం వస్తుంది. మనిద్దరం వెళ్లి ఆయన్ని కల్సుకుందాం అమ్మా. ఆయన నీకు తెలుసుకదా?"

వర్ధని గభాల్న ముఖం తిప్పుకుంది.

చాట అందుకుని మళ్లీ గోధుమలు బాగుచెయ్యటం మొదలుపెట్టింది. "ఏమోనే. నాకు జ్ఞాపకం రావటం లేదు" అంది.

కాని వర్ధనికి జ్ఞాపకం రాకపోవటానికి అసలు చక్రపాణిని మరిచిపోతే కదా?

చంద్రకళని నిశితంగా చూసినప్పుడల్లా ఆమెకు జ్ఞాపకం వచ్చేది చక్రపాణే!

* * *

సాయంత్రం ఆరు దాటుతూంది.

దీపాలు వెలిగాయి.

ఇంటిముందు కారు హారన్ మోత, ఆ వెనువెంటనే గేటు తీసిన శబ్దం అవటంతో చంద్రకళ గబగబా ఇవతలకి వచ్చింది.

కారులోంచి దిగుతున్న చక్రపాణిని చూస్తూనే ఆమె నోరు తెరుచుకుని పోయింది.

వెర్రి ఆనందంలో "అమ్మా" అంటు లోపలికి పరిగెత్తింది.

ఆ రోజు ఉదయం నుంచి వర్ధనమ్మ ఆరోగ్యం బాగా దిగజారిపోయింది. మగతగా మంచంలో పడుకుంది.

చంద్రకళ ఉద్వేగంతో తల్లి భుజంమీద కొడ్తుతూ—

"అమ్మా. లే...లేవే...మొన్న నేను చెప్పానే చక్రపాణిగారు అని ఆయన మనింటికి వచ్చారే..."


దేవుడే దిగివచ్చినంత సంతోషంతో తల్లిని కదిలించింది. మళ్లీ ఛెంగున వసారాలోకి వెళ్లింది.

లోపలినుంచి కుర్చీ తెచ్చి వసారాలో వేసింది.

"కూర్చోండి సార్. మాట మాత్రం చెప్పలేదేం సార్ మా ఇంటికి వస్తున్నట్టు" అంది.

చక్రపాణి చిరునవ్వుతో చంద్రకళ కేసి చూశాడు.

ఆ అమ్మాయిని చూస్తుంటే ఆయనలో



ఏవేవో మధురస్మృతులు...ఆ చిన్నారితో ఏదో తెలియని బంధం ఉన్నట్టుగా అనిపించింది.

ఎదురుగా లేడిలా ఛెంగుఛెంగుమని తిరుగుతున్న చంద్రకళని చూస్తుంటేఅతనికి ఎంతో ముచ్చటేసింది.

అతని కళ్లు ఇంకా ఎవరికోసమో వెదుకుతున్నాయ్.

ఇంద్రధనుస్సుల్నీ, అదృశ్యస్వర్గాల్నీ కలల్లో ఆవిష్కరించుకుంటూ...

ప్రభవర వసంతవల్లిక పల్లకి శుక్రచాప వక్రరేఖ పల్లకి మధుర స్వప్న పల్లకి...

ధడ్...

తలుపుదగ్గర శబ్దానికి ఉలిక్కిపడ్డాడు.

వర్ధని చీరకొంగు భుజం నిండా కప్పుకుని ఇవతలకి వచ్చింది.

చక్రపాణిని చూస్తూనే రెండుచేతులు జోడించింది. ఆమె గాజు కళ్లనిండా నీళ్లు ఊరాయి.

చక్రపాణి కుర్చీలోంచి లేచినిల్చుని వర్ధనికి నమస్కారం చేశాడు.

"నన్ను గుర్తుపట్టా..."

"అయ్యో. ఎంతమాట?" అంది.

వర్ధని గడప వారగా కూర్చుంది.

"రఘుపతిగారు..."

"ఆయన పోయారు. అప్పట్నుంచే మా పరిస్థితి తారుమారైంది. ఇల్లు అమ్మేయ్యాల్సి వచ్చింది. పింఛను వస్తున్నది. దాంతోనే గడుస్తుంది. నాకా చదువులేదు. ఇప్పుడు ఆరోగ్యం పోయింది. కొద్దిరోజుల కంటె ఎక్కువకాలం బతకనని డాక్టర్లు చెప్పారు. అందుకే మా అమ్మాయి చంద్రకళని ఇంటరుతో చదువు చాలించి ఉద్యోగ ప్రయత్నంలోకి దింపాను."

చక్రపాణి భ్రుకుటి ముడుచుకుంది. కళ్లు తీక్షణంగా అయ్యాయి. సూది చూపుల్తో వర్ధనికేసి చూశాడు.

"చంద్రకళ మీ అమ్మాయా?"

వర్ధని ఒకసారి ఆయన ముఖంలోకి చూసి తల దించుకుంది.

నాలుగురోజుల్నుంచి చంద్రకళ పోరు పెడుతూనే ఉంది. ఒకసారి ఇద్దరం వెళ్లి చక్రపాణి గార్ని ఇంటి దగ్గర కలుద్దాం అని. "అమ్మా, నువ్వు ఆయన్ని నా ఉద్యోగం గురించి అడుగు" అని వేధిస్తోంది.

అప్పట్నుంచి ఆలోచిస్తూనే ఉంది వర్ధని.

ఆలోచన్లు ఒక రూపానికి వచ్చాయి.

కాని మనసు డోలాయమానంగా ఉంది. మళ్లీ అంతలోనే

"తనుగాని తప్పు చేస్తుందా?" అనిపించింది అయినా తప్పు ఒప్పు పట్టిక కాదు ముఖ్యం. వయసు వచ్చిన చంద్రకళకి తను ఒక ఆధారం చూపించటం తన బాధ్యత కదూ!

పూతకి వచ్చిన తీగ పందిరికి అల్లుకుంటేనే ఫలవంతం అవుతుంది. పందిరి ఆధారం లేకపోతే ఏ పశువులో పాడు చేస్తాయి. బురదపాలు అవుతుంది.

"ఏమిటి మాట్లాడరు? చంద్రకళ మీ అమ్మాయా?"

"మీ అమ్మాయా" అన్న మాటని ఒత్తి పలికాడు.

"కాదు" అన్నట్లు తల కదిలించింది నోరు విప్పాలంటే ఏదో సందిగ్ధత.

"చంద్రా, ఆయనకి తాగటానికి మంచి కాఫీ కలిపి తీసుకురా. ముందు మంచితీర్థం తెచ్చియ్యి." అంది.

(మిగతా వచ్చేవారం)